జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..
https://tholivelugu.com/
హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 169 5-7-2026 వెల: రూ.2/- పేజీలు: 06

విలేకరులు కావలెను
తొలివెలుగు జాతీయ దిన పత్రిక మన భాష.. మన పత్రిక..
www.epaper.tholivelugu.com
Contacts
తెలంగాణ
94911 34365
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో
తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.



## రంకెలు వేస్తే అంకెలు మారవు

- బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పు రూ.4.17 లక్షల కోట్లే
- దీనిపై అసెంబ్లీలోనైనా, బహిరంగ వేదికపైనైనా, ఎక్కడైనా చర్చకు సిద్ధం
- బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు సవాల్
- కాంగ్రెస్ ఇప్పటివరకు రూ.4.50 లక్షల కోట్ల అప్పు చేసిందని వ్యాఖ్య

హైదరాబాద్: అప్పుల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలను ఉద్దేశపూర్వకంగా తప్పుదోవ పట్టిస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు విమర్శించారు.

- మిగతా 2వ పేజీలో

## తాడేపల్లి నుంచి ఎంత డబ్బు అందుతోంది?



- రావణ్ కు మద్దతుగా నిలిచిన ప్రకాశ్ రాజ్
- కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ వరుస ట్వీట్లు
- రావణ్ తో ఉన్న చీకటి సంబంధాలు ఏమిటో చెప్పాలని డిమాండ్

## పార్టీ పేరు మార్చాలంటూ ఈసీ ఆదేశం..

- 15 రోజుల్లోగా మూడు ప్రత్యామ్నాయ పేర్లను సమర్పించాలని కవితకు ఈసీ సూచన
- కొత్త పేర్లు పంపకపోతే పార్టీ దరఖాస్తును క్లోజ్ చేస్తామని హెచ్చరిక
- కొత్త పేర్లు పంపే ప్రసక్తే లేదన్న కవిత





## ఇంధన సంక్షోభాన్ని అధిగమించాం

- పౌరులపై ఆర్థిక భారాన్ని చాలావరకు తగ్గించాం
- ప్రజలను భయపెట్టాలని చూసిన శక్తులకు నిరాశే మిగిలింది
- ఏప్రిల్--జూన్‌లో చమురు కంపెనీలు రూ.75,000 కోట్లు నష్టపోయాయి
- ఆ నష్టభారాన్ని కేంద్ర ప్రభుత్వమే భరించింది
- స్వయం సమృద్ధిని సాధించినప్పుడే ఆత్మగౌరవం పెరుగుతుంది
- ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టికరణ

## కుప్పంలోనూ బంగారం నిక్షేపాలు ఉన్నాయంటున్నారు

- కుప్పాన్ని 'స్వర్ణ కుప్పం'గా తీర్చిదిద్దడమే లక్ష్యమన్న సీఎం చంద్రబాబు
- రూ.118 కోట్లతో ఆధునిక బస్ స్టేషన్, డిపో నిర్మాణానికి శంకుస్థాపన
- కర్నూలు జిల్లా జొన్నగిరి తరహాలోనే కుప్పంలోనూ బంగారు గనులు ఉన్నాయని వెల్లడి
- గత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు, సీమలో ఫ్యాక్షన్ యుగం ముగిసిందని స్పష్టీకరణ
- అమరావతి రాజధానిగా ఉండాలని ప్రజలు కోరుకుంటే, గొడ్డలి పార్టీ 'మావిగన్' అంటోందని ఎద్దేవా



తన సొంత నియోజకవర్గమైన కుప్పాన్ని ఒక అభివృద్ధి కేంద్రంగా, దేశానికే ఆదర్శంగా నిలిపే 'స్వర్ణ కుప్పం' నిర్మాణానికి నాంది పలుకుతున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. కుప్పం పర్యటనలో భాగంగా... రూ.118 కోట్ల వ్యయంతో నిర్మించనున్న అత్యాధునిక ఆర్టీసీ బస్ స్టేషన్, డిపో పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ప్రసంగించిన చంద్రబాబు, అభివృద్ధి ప్రణాళికలను వివరిస్తూనే గత ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శనాస్త్రాలు సంధించారు.

**కుప్పంలోనూ బంగారు గనులు**

కర్నూలు జిల్లా జొన్నగిరిలో గోల్డ్ ఫీల్డ్స్ ప్రారంభించామని తెలిపారు. ఇప్పుడు కుప్పం ప్రాంతంలోనూ బంగారు గనులు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారని చంద్రబాబు సంచలన విషయం వెల్లడించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఆ బంగారు

- మిగతా 2వ పేజీలో



## వీళ్లెందుకు మళ్లీ రావాలి?..

### ఏం అన్యాయం చేసిందని ప్రజా ప్రభుత్వం పోవాలి?

- పాపాల భైరవుడు రావాలి.. రావాలి అని కొడుకు, అల్లుడు తిరుగుతున్నారు
- 2034 వరకు కాంగ్రెస్‌దే అధికారమన్న ముఖ్యమంత్రి
- రాహుల్‌ను ప్రధానిని చేసేందుకు రాష్ట్ర ప్రజలు తనతో కలిసి నడవాలని పిలుపు
- మిడ్జిల్ మండలానికి ఏమిచ్చినా, చివరికి తన ప్రాణమిచ్చినా తక్కువేనని వ్యాఖ్య
- మిడ్జిల్‌లో పర్యటన.. అంబేడ్కర్, ధ్యాప గోపాల్‌రెడ్డి విగ్రహాల ఆవిష్కరణ
- రూ.17 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మహబూబ్‌నగర్: పాపాల భైరవుడు రావాలి.. రావాలి అని కొడుకు, అల్లుడు తిరుగుతున్నారని, పదేళ్లలో రూ.8.21 లక్షల కోట్లు అప్పులు చేసిన కేసీఆర్ ప్రజలకు ఏం చేశారని సీఎం రేవంత్‌రెడ్డి నిలదీశారు. 'మీ ఊళ్లలో ఎవరికైనా డబుల్

- మిగతా 2వ పేజీలో



2లో

## మాజీ అధ్యక్షులందరితో రీయూనియన్

డొనాల్డ్ ట్రంప్ ఆలోచన ఉషా వాన్స్ పాడ్‌కాస్ట్‌లో వెల్లడి

## లక్ష మంది అనర్హులకు పింఛన్!

- ఆచూకీ తెలియని 30 వేల మంది లబ్ధిదారులు
- రాష్ట్రం వెలుపల 5వేల మంది నివాసం
- లైవ్ అథెంటికేషన్ ప్రక్రియలో విస్తుపోయే నిజాలు
- బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్న వాటిల్లో అక్రమాలు
- 17 లక్షల మంది వివరాల పరిశీలన



హైదరాబాద్: లోతైన పరిశీలన జరిపే కొద్దీ అనర్హులకు చేయూత పింఛన్లు అందుతున్న వైనం విస్మయం కలిగిస్తోంది. ప్రస్తుతం ప్రభుత్వపరంగా రాష్ట్రవ్యాప్తంగా కొనసాగిస్తున్న లైవ్ అథెంటికేషన్ ప్రక్రియలో పెద్దసంఖ్యలో అనర్హుల జాబితా బయటకు వస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 42 లక్షల మంది చేయూత పెన్షన్ దారులుండగా (దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి

## పార్టీ పేరు మార్చాలంటూ ఈసీ ఆదేశం..

సొంత పార్టీ స్థాపనతో తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త ప్రస్థానాన్ని ప్రారంభించాలనుకున్న మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల కవితకు కేంద్ర ఎన్నికల సంఘం ఊహించని బిగ్ షాక్ ఇచ్చింది. 'తెలంగాణ రక్షణ సేన (౧=నా)' పేరుతో పార్టీ రిజిస్ట్రేషన్ కోసం ఆమె చేసుకున్న దరఖాస్తుపై ఏకంగా వెయ్యికి పైగా అభ్యంతరాలు వచ్చాయని సీఈసీ వెల్లడించింది. పార్టీ పేరు మార్చాల్సిందేనంటూ ఆదేశాలు జారీ చేసింది. పార్టీ నమోదు ప్రక్రియ ముందుకు సాగాలంటే 15 రోజుల్లోగా మరో మూడు ప్రత్యామ్నాయ పేర్లను తమకు సమర్పించాలని స్పష్టం చేస్తూ కవితకు అధికారికంగా లేఖ రాసింది. నిర్ణీత గడువులోగా కొత్త పేర్లు పంపకపోతే, ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండానే పార్టీ రిజిస్ట్రేషన్ దరఖాస్తును క్లోజ్ చేస్తామని సీఈసీ ఆ లేఖలో కఠినంగా హెచ్చరించింది. ఈసీ పంపిన లేఖపై కల్వకుంట్ల కవిత అత్యంత ఘాటుగా స్పందించారు. ఎన్నికల సంఘం లేఖలో పేర్కొన్న అభ్యంతరాలకు తాము ఇప్పటికే రాతపూర్వక సమాధానాలు ఇచ్చామని తెలిపారు. ఈసీ కోరినట్లుగా ప్రత్యామ్నాయంగా కొత్త పేర్లను పంపే ప్రసక్తే లేదని ఆమె తేల్చిచెప్పారు. 'తెలంగాణ రక్షణ సేన' పేరుపైనే తాము ముందుకు వెళ్తామని, అవసరమైతే ఈ విషయంలో కేంద్ర ఎన్నికల సంఘంపై కోర్టుకు వెళ్లి న్యాయపోరాటం చేయడానికైనా సిద్ధమని కవిత స్పష్టం చేశారు.

## కుప్పంలోనూ బంగారం నిక్షేపాలు ఉన్నాయంటున్నారు

నిక్షేపాలను వెలికితీసి, 'స్వర్ణ కుప్పం' ఆవిష్కరణకు నిజమైన అర్థం కల్పిస్తామని ప్రకటించారు. మైక్రో ఇరిగేషన్‌లో దేశానికే ఆదర్శంగా నిలిచిన కుప్పం మోడల్‌ను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామన్నారు. హంద్రీ-నీవా జలాలతో 110 చెరువులు నింపామని గుర్తుచేశారు. రాయలసీమను ఉద్యాన హబ్?గా మార్చే 'పూర్వోదయ' ప్రాజెక్టుకు వచ్చే నెల మదనపల్లెలో శంకుస్థాపన చేస్తామని తెలిపారు. ఒకప్పుడు ఎన్టీఆర్ హయాంలో కుప్పంలో బస్ స్టేషన్‌కు శంకుస్థాపన జరిగిందని, ఇప్పుడు అదే స్థానంలో సౌర విద్యుత్ వంటి ఆధునిక సదుపాయాలతో మోడల్ బస్ స్టేషన్, డిపో నిర్మాణానికి శ్రీకారం చుట్టామని చంద్రబాబు తెలిపారు. కుప్పాన్ని స్వర్ణ కుప్పంగా మార్చే క్రమంలో పరిశ్రమల స్థాపనకు పెద్దపీట వేస్తున్నామన్నారు. "ఉద్యోగాల కోసం కుప్పం యువత బయటకు వెళ్లడం కాదు, ఇతర ప్రాంతాల వారు ఉద్యోగాల కోసం కుప్పానికి వచ్చే పరిస్థితి కల్పిస్తాం" అని ఆయన ఉద్ఘాటించారు. ఒక్క రోజులోనే రూ.9,322 కోట్ల పెట్టుబడులతో 30 ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, ఒప్పందాలు జరిగాయని, వీటి ద్వారా సుమారు 80 వేల మందికి ఉపాధి లభిస్తుందని వివరించారు. ప్రఖ్యాత అడిడాస్ ఫుట్‌వేర్ సంస్థతో పాటు టూ సీటర్ ట్రైనీ ఎయిర్‌క్రాఫ్ట్ తయారీ, డెయిరీ, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు కుప్పానికి వస్తున్నాయని వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీలకు సోలార్ రూఫ్‌టాప్ ద్వారా ఉచిత విద్యుత్, బీసీ, ఓసీలకు రూ.552 కోట్లతో సౌర విద్యుత్ సదుపాయం కల్పిస్తామని చెప్పారు. 'నెట్ జీరో' విధానంలో భాగంగా ఇళ్లపైనే కూరగాయలు పండించుకోవడం, ఈ-సైకిళ్ల వాడకం పెంచి కుప్పాన్ని కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. కుప్పంలోని బ్లూ గ్రానైట్‌కు ప్రపంచవ్యాప్తంగా ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని 'హెరిటేజ్ గ్రానైట్ క్లస్టర్' ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.

## రంకెలు వేస్తే అంకెలు మారవు

బీఆర్‌ఎస్ పాలనలో రూ.8.21 లక్షల కోట్ల అప్పు అంటూ గోబెల్స్ ప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల హామీలు అమలు చేయలేక, రోజూ బయటపడుతున్న అవినీతి ఆరోపణలు, స్కామ్‌ల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రోజుకో కొత్త అప్పుల లెక్క చెబుతున్నారని ధ్వజమెత్తారు. 'రంకెలు వేసినంత మాత్రాన అంకెలు మారవు. మా మాట అసెంబ్లీలో ఒకటే.. బయట ఒకటే. మీరు మాత్రం శ్వేతపత్రంలో ఒకలా, అసెంబ్లీలో మరోలా, ప్రెస్‌మీట్లలో ఇంకోలా చెబుతున్నారు. బాధ్యతాయుతమైన రాజకీయ నాయకుడిగా, ఎమ్మెల్యేగా, తెలంగాణ ఉద్యమకారుడిగా, కేసీఆర్ శిష్యుడిగా చెప్తున్నా. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అప్పు రూ.4.17 లక్షల కోట్లే. దీనిపై అసెంబ్లీలోనైనా, బహిరంగ వేదికపైనైనా, ఎక్కడైనా చర్చకు సిద్ధం..'అని మరోసారి సవాల్ విసిరారు. రాష్ట్రానికి అప్పులు ఇప్పించేందుకు సచివాలయం చుట్టూ బాంబే, గుజరాత్ బ్రోకర్లు తిరుగుతున్నారని లంచాలు ఇచ్చి అప్పులు తెచ్చే దుస్థితి దేశంలో ఎక్కడా లేదని ధ్వజమెత్తారు. శనివారం తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రులు గంగుల కమలాకర్, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే కేపీ వివేక్, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ తదితరులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. శుక్రవారం డిప్యూటీ సీఎం భట్టి చెప్పిన అప్పుల లెక్కలకు కౌంటర్ ఇచ్చారు. 'భట్టి విక్రమార్క వెల్లడించిన పత్రాల్లో.. తెలంగాణ ఏర్పాటుకు ముందున్న రూ.84,268 కోట్ల రుణాలను, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2023 డిసెంబర్ 7 నుంచి 2024 మార్చి 31 వరకు తీసుకున్న రూ.15,118 కోట్ల అప్పును కూడా బీఆర్‌ఎస్ ప్రభుత్వ ఖాతాలో కలిపేశారు.

## రామాలయం చోరీ కేసు ఛేదించిన పోలీసులు

**- ఇద్దరు నిందితులకు రిమాండ్.. ఆటో స్వాధీనం - చౌటుప్పల్ ఇన్‌స్పెక్టర్ మన్మథ కుమార్ వెల్లడి**



**తొలివెలుగు, చౌటుప్పల్:** మండలంలోని తూప్రాన్‌పేట గ్రామంలోని రామాలయంలో జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించి ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఘటనలో ఉపయోగించిన ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు చౌటుప్పల్ ఇన్‌స్పెక్టర్ జి. మన్మథ కుమార్ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 2వ తేదీ తెల్లవారుజామున సుమారు 2 గంటల సమయంలో తూప్రాన్‌పేట గ్రామంలోని రామాలయంలో చోరీ జరిగింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు సాంకేతిక ఆధారాలు, ఇతర సమాచారాన్ని పరిశీలించి ఇద్దరు నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు చేసిన నిందితులను కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం రిమాండ్ విధించినట్లు తెలిపారు. అలాగే చోరీకి ఉపయోగించిన టీఎస్ 05 యూఎఫ్ 3648 నంబర్ గల ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ కేసులో తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని ఇన్‌స్పెక్టర్ జి. మన్మథ కుమార్ తెలిపారు.

# ఇంధన సంక్షోభాన్ని అధిగమించాం

పాచ్‌పద్రా/జోధ్‌పూర్: ఈ శతాబ్దంలో అతిపెద్ద ప్రపంచ ఇంధన సంక్షోభాల్లో ఒకదానిని మనం విజయవంతంగా అధిగమించామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. చురుకైన ప్రభుత్వ విధానాలు, వైవిధ్యమైన ఇంధన వనరులు, బలమైన దౌత్య సంబంధాల ద్వారా పౌరులపై ఆర్థిక భారాన్ని చాలావరకు తగ్గించామని తెలిపారు. ఇంధన సంక్షోభం కారణంగా ప్రధాన దేశాలు ఇబ్బందులు ఎదుర్కొన్నాయని వెల్లడించారు. ఇంధనం విషయంలో కొన్ని శక్తులు ప్రజల్లో భయాన్ని వ్యాప్తి చేయడంలో నిమగ్నమయ్యాయని విమర్శించారు. రాజకీయ క్రీడలు సాగాయని అన్నారు. కానీ, ప్రజలకు ఉపశమనం కల్పించడానికి ప్రభుత్వం చేపట్టిన చర్యలతో ఆ శక్తుల పథకం పారలేదని, తీవ్ర నిరాశలో కూరుకుపోయాయని ఎద్దేవా చేశారు. సంక్షోభాన్ని మనం అధిగమించిన తీరు చరిత్రలో ఒక అపూర్వమైన అధ్యాయంగా గుర్తుండిపోతుందని వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ శనివారం రాజస్తాన్‌లో పర్యటించారు. బలోత్రాలో దేశంలోనే మొట్టమొదటి గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ రిఫైనరీ--పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌ను జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మాట్లాడారు. పశ్చిమాసియాలో జరిగిన యుద్ధం 21వ శతాబ్దంలోనే అతిపెద్ద ఇంధన సంక్షోభాన్ని సృష్టించిందని గుర్తుచేశారు. అనేక శక్తివంతమైన దేశాలు ఇంధన కొరతతో సతమతమయ్యాయని అన్నారు. సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకోవడం, పరిస్థితిని సరిగ్గా అంచనా వేయడం, మన వనరులను సమతుల్యంగా ఉపయోగించడం, దౌత్య బలాన్ని సానుకూలంగా వినియోగించుకోవడం ద్వారా ఈ సవాలును సమర్థంగా ఎదుర్కొన్నామని స్పష్టంచేశారు. గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ రిఫైనరీని ఏప్రిల్ 21న మోదీ చేతుల మీదుగా ప్రారంభించాల్సి ఉండగా, 20న జరిగిన అగ్?నప్రమాదం వల్ల వాయిదా పడిన సంగతి తెలిసిందే. రెండు నెలల్లోనే మరమ్మతులు పూర్తి చేసినందుకు అధికారులను మోదీ అభినందించారు. అనేక అభివృద్ధి చెందిన దేశాలు చమురు శుద్ధి సామర్థ్యాన్ని పెంచుకోవడంలో విఫలమైనప్పటికీ.. భారతదేశం మాత్రం ఆ సామర్థ్యాన్ని గణనీయంగా విస్తరింపజేసుకుంది. గత 50 ఏళ్లలో అమెరికా కొత్తగా చమురు శుద్ధి కర్మాగారాన్ని నిర్మించలేదు. ఐరోపా శుద్ధి సామర్థ్యం నానాటికీ తగ్గుతూ వస్తోంది. ప్రస్తుతం అయిల్ రిఫైనరీ సామర్థ్యం పరంగా భారత్ ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద దేశంగా అవతరించింది. ఈ సామర్థ్యం ఇంకా పెరుగుతూనే ఉంటుంది. అంతర్జాతీయంగా చమురు ధరలు పెరగడం వల్ల ఏప్రిల్ నుంచి జూన్ మధ్య మన దేశ చమురు కంపెనీలు రూ.75,000 కోట్లకు పైగా నష్టాలను చవిచూశాయి. అయితే, ఆ భారాన్ని ప్రభుత్వమే భరించింది. ప్రపంచవ్యాప్తంగా చాలాదేశాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు 40 నుంచి 50 శాతం వరకు పెరిగాయి. ఇంధనాన్ని కోటా పద్ధతిలో పంపిణీ చేశారు. మన దేశంలో ఒక్కరోజు కూడా అలాంటి పరిస్థితి తలెత్తలేదు. కొందరు మాత్రం చమురు విషయంలో వదంతులు వ్యాప్తి చేశారు. ప్రజలను భయపెట్టారు, రాజకీయ క్రీడలు ఆడారు. కానీ, వారు సఫలం కాలేకపోయారు. సంక్షోభ సమయంలో మనం తీసుకున్న ప్రతి కీలక నిర్ణయం చరిత్రలో భాగం అవుతుంది. ప్రభుత్వ ప్రతిష్టాత్మక ప్రాంతీయ అనుసంధాన పథకం 'ఉడాన్'తదుపరి దశను ప్రధాని మోదీ శనివారం ప్రారంభించారు. అలాగే జోధ్‌పూర్ విమానాశ్రయంలో రూ.480 కోట్ల వ్యయంతో నిర్మించిన కొత్త టెరి?మనల్ భవనాన్ని ప్రారంభించారు. సవరించిన ఉడాన్ పథకాన్ని ఈ ఏడాది ప్రారంభంలో కేంద్ర మంత్రివర్గం ఆమోదించిన సంగతి తెలిసిందే. ఈ పథకం అమలుకు రాబోయే పదేళ్లలో దాదాపు రూ.29,000 కోట్లు ఖర్చు చేయబోతున్నారు. మన ఎల్పీజీ అవసరాల్లో దాదాపు 70 శాతం దిగుమతుల ద్వారానే తీరుతోంది. ఆ సరఫరాలలో సుమారు 90 శాతం ఎల్పీజీ హార్మూజ్ జలసంధి గుండా గల్ఫ్ దేశాల నుంచి వస్తోంది.

## లక్ష మంది అనర్హులకు పింఛన్!

మహిళలు ఇలా వివిధ కేటగిరీల వారు), వారిలో దాదాపు 19 లక్షల మంది లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో ప్రతి నెలా కోర్ బ్యాంకింగ్ విధానంలో (సీబీఎస్) పెన్షన్ జమ అవుతోంది. అయితే దీనికి సంబంధించి గతంలో దారిద్ర్య నిర్మూలనాసంస్థ (సెర్ప్) నిర్వహించిన పైలట్ పరిశీలనలో పెద్దఎత్తున అక్రమాలు బయటపడ్డాయి. దీంతో ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా లైవ్ అథెంటిఫికేషన్ ప్రక్రియ చేపట్టింది. ఇందులో భాగంగా శుక్రవారం వరకు సుమారు 17 లక్షల మంది లబ్దిదారుల ధ్రువీకరణ పూర్తికాగా, మరో 2 లక్షల మంది ధ్రువీకరణ మిగిలి ఉంది. ఈ లబ్దిదారుల లైవ్ అథెంటిఫికేషన్‌ను కూడా ప్రభుత్వం వేగంగా పూర్తి చేసే దిశలో చర్యలు చేపడుతోంది. ఇప్పటికే గుర్తించిన అనర్హుల స్థానంలో అర్హులైన పేదలకు పెన్షన్లు మంజూరు చేయడం ద్వారా కొత్తగా 2 లక్షల మందికి నూతనంగా అందించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటివరకు పూర్తయిన ధ్రువీకరణలో దాదాపు లక్ష మంది దాకా అనర్హులకు పింఛన్లు అందుతున్నట్లుగా గుర్తించారు. దీంతో ప్రభుత్వం నిధుల దుర్వినియోగాన్ని అరికట్టడంతో పాటు సంక్షేమ పథకాల అమలులో పారదర్శకతను మరింతగా అమలు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇప్పటివరకు నిర్వహించిన ధ్రువీకరణలో ఆందోళనకర విషయాలు వెలుగుచూశాయి. దాదాపు లక్ష మంది దాకా అనర్హులుగా గుర్తించారు. వారిలో దాదాపు 65 వేల మంది మరణించినప్పటికీ వారి పేర్లపై పింఛన్లు కొనసాగుతున్నట్లు తేలింది.

## వీళ్లెందుకు మళ్లీ రావాలి?..

బెడ్రూమ్‌లు, ఇంటికో ఉద్యోగం, దళితులకు మూడెకరాలు ఇచ్చారా? కోటి ఎకరాలకు నీళ్లు అందించారా? ఎందుకు వీళ్లు మళ్లీ రావాలి?..' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ పాలనను రావణుడితో, కాంగ్రెస్ పాలనను రాముడి పాలనతో పోలుస్తూ.. రాముడి పాలన కావాలా.. రావణుడి పాలన కావాలా? అనేది ప్రజలు ఆలోచించుకోవాలన్నారు. ప్రజా ప్రతినిధిగా 20 ఏళ్ల ప్రస్థానం పూర్తి చేసుకున్న సందర్భంగా రేవంత్‌రెడ్డి శనివారం మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్‌లో పర్యటించారు. ముందుగా నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండపేటలోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడే ఆత్మీయులతో ముచ్చటించారు. ఆ తర్వాత డీసీసీబీ మాజీ చైర్మన్ ధ్యాప గోపాల్‌రెడ్డి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉమ్మడి మిడ్జిల్ మండలంలోని 40 గ్రామ పంచాయతీలకు రూ.50 లక్షల చొప్పున మొత్తం రూ.20 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా ఊర్కొండ ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి రూ.10 కోట్లతో శిలాఫలకం ఆవిష్కరించారు. సుమారు రూ.17 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన ఆత్మీయ కృతజ్ఞత వందన సభలో మాట్లాడారు.

## తాడేపల్లి నుంచి ఎంత డబ్బు అందుతోంది?

యూట్యూబర్ ప్రశ్న రావణ్ (జోసెఫ్) అరెస్టుల పర్వంపై నటుడు ప్రకాశ్ రాజ్ చేసిన విమర్శలకు ఏపీ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ ఘాటుగా బదులిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో కావాలనే అశాంతిని, ఘర్షణ వాతావరణాన్ని రగిల్చేందుకు ఒక ముఠా ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. మీడియా ముఖంగా ప్రకాశ్ రాజ్, రావణ్‌లపై విరుచుకుపడిన మంత్రి... వారిద్దరినీ సమాజ విద్రోహ శక్తులుగా అభివర్ణించారు. అసలు ఈ వివాదాస్పద యూట్యూబర్‌తో ప్రకాశ్ రాజ్‌కు ఉన్న చీకటి సంబంధాలేంటో చెప్పాలని డిమాండ్ చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఎన్నో అకృత్యాలు సాగాయని, హిందూ దేవాలయాలపై దాడులు జరిగాయని.. అప్పుడు లేవని ప్రకాశ్ రాజ్ గొంతు ఇప్పుడు ఎందుకు లేస్తోందని మంత్రి కందుల దుర్గేశ్ నిలదీశారు. "నాడు మూగనోము నోమిన మీరు.. నేడు కూటమి ప్రభుత్వంపై విషం చిమ్మడానికి తాడేపల్లి ప్యాలెస్ నుంచి ప్రతి నెలా ఎంత డబ్బు అందుకుంటున్నారు?" అంటూ నేరుగా ప్రశ్నించారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం, రాష్ట్రంలో అశాంతిని రేకెత్తించి శాంతిభద్రతలను దెబ్బతీయడానికే ఇలాంటి శక్తులు కుట్రలు పన్నుతున్నాయని, వీటిని ప్రభుత్వం కఠినంగా అణచివేస్తుందని మంత్రి హెచ్చరించారు.

## మాజీ అధ్యక్షులందరితో రీయూనియన్

అమెరికా 250వ స్వాతంత్ర్య ఉత్సవ వేడుకల్లో భాగంగా "స్టోరీ టైమ్ విత్ సెకెండ్ లేడీ' పేరుతో ఈ పాడ్‌కాస్ట్‌ను నిర్వహించారు. ఇందులోనే డొనాల్డ్ ట్రంప్ వైట్‌హౌస్ హిస్టారికల్ అసోసియేషన్ ప్రచురించిన 'ప్రెసిడెంట్స్ ప్లే' పుస్తకంలో కొంత భాగాన్ని చదివి వినిపించారు. బహిరంగ సభలు, విలేకరుల సమావేశాల్లో ఒబామా, బైడెన్‌లను విమర్శించే అవకాశాన్ని ఏనాడూ వదులుకోని ట్రంప్ వారితో కలిసి సూపర్ బౌల్ మ్యాచ్ చూసేందుకు వైట్‌హౌస్‌లో ఆతిథ్యం ఇవ్వాలన్న ఆలోచన ఉషా వాన్స్‌దేనని వెల్లడించారు. "బరాక్ ఒబామా, జో బైడెన్‌లతోపాటు బుష్‌లను ఆహ్వానించాలనుకుంటా. బహుశా వీరిలో కొందరినైనా ఆహ్వానించి వారితో కలిసి ఫుట్‌బాల్ మ్యాచ్ చూడాలి. ఇదే మంచి స్టోరీ అవుతుంది కదా?. మీడియాకు పిచ్చెక్కుతుంది. అధ్యక్షుల రీ యూనియన్ అంటే సరదాగానూ ఉంటుంది" అని అన్నారు.

# ఉచిత కంటి వైద్య శిబిరానికి ఏర్పాట్లు పూర్తి



**- ఉచిత కంటి వైద్య శిబిరాన్ని విజయవంతం చేయాలి**

**- వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాట్లను పరిశీలించిన ప్రజాప్రతినిధులు, పోలీసులు**

**- ఉచిత పరీక్షలు, శస్త్రచికిత్సలు, కళ్లద్దాలు, మందుల పంపిణీ**





**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో ఆదివారం కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత కంటి వైద్య శిబిరానికి సంబంధించిన ఏర్పాట్లను శనివారం ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, పోలీసులు పరిశీలించారు. ఈ సందర్భంగా చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్, మునుగోడు నియోజకవర్గ సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్ మాట్లాడుతూ.. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో నిర్వహిస్తున్న ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ శిబిరంలో కంటి పరీక్షలతో పాటు అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు, కళ్లద్దాలు, మందులు అందజేయనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన నేత్ర వైద్య సేవలు అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బోయ దేవేందర్, మున్సిపల్ అధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి, మాజీ మున్సిపల్ అధ్యక్షుడు సుర్వి నరసింహ గౌడ్, ఏఎంసీ డైరెక్టర్లు, యువజన కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..


# ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాండ్‌కు మైక్ సెట్ బహూకరణ



- ఆర్టీసీ కంట్రోలర్‌కు అందజేసిన సీఐ మన్మధ కుమార్, ట్రినిటీ స్కూల్ యాజమాన్యం
- సామాజిక సేవా దృక్పథం అభినందనీయం: ఇన్‌స్పెక్టర్ మన్మధ కుమార్

**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం స్థానిక ట్రినిటీ స్కూల్ యాజమాన్యం ఒక మైక్ సెట్‌ను విరాళంగా అందజేసింది. శనివారం బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చౌటుప్పల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సి.ఐ) మన్మధ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై, ఈ మైక్ సెట్‌ను ఆర్టీసీ కంట్రోలర్ ఆనందరావుకు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మన్మధ కుమార్ మాట్లాడుతూ.. బస్టాండ్‌లో ప్రయాణికులకు బస్సుల రాకపోకలు, వేళల వివరాలను ఎప్పటికప్పుడు స్పష్టంగా తెలియజేయడానికి ఈ మైక్ సెట్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. విద్యాబోధనతో పాటు ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములవుతూ, ప్రయాణికుల ఇబ్బందులను గుర్తించి మైక్ సెట్‌ను బహూకరించిన ట్రినిటీ పాఠశాల యాజమాన్యాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. వ్యాపార ధోరణి వీడి సమాజానికి ఉపయోగపడే పనులు చేయడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో ట్రినిటీ స్కూల్ డైరెక్టర్ కం ప్రిన్సిపాల్ డాక్టర్ ఉజ్జిని మంజుల, పాఠశాల చైర్మన్ కె.వి.బి. కృష్ణారావు, ఆర్టీసీ సిబ్బంది, ఉపాధ్యాయులు, స్థానిక ప్రయాణికులు పాల్గొన్నారు.

# దొడ్డి కొమరయ్య ఆశయాలను కొనసాగించాలి

- చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన జీఎంపీఎస్ నాయకులు



**తొలివెలుగు, చౌటుప్పల్:** అమరజీవి దొడ్డి కొమరయ్య ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని గొర్రెల మేకల పెంపకందారుల సంఘం (జీఎంపీఎస్) నాయకులు అన్నారు. శనివారం చౌటుప్పల్ మండల కమిటీ ఆధ్వర్యంలో దొడ్డి కొమరయ్య స్మారక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎంపీఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా గౌరవ అధ్యక్షుడు బండారు నరసింహ, చౌటుప్పల్ మండల కార్యదర్శి కొండే శ్రీశైలం కలిసి దొడ్డి కొమరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. నాడు భూస్వామ్య విధానాలకు వ్యతిరేకంగా, అణగారిన ప్రజల హక్కుల కోసం అండగా నిలబడి పోరాడిన వీరుడు దొడ్డి కొమరయ్య అని కొనియాడారు. రజాకార్ల, భూస్వాముల గుండాల తుపాకీ గుళ్లకు ఎదురొడ్డి నిలిచి నేలకొరిగిన ఆయన త్యాగం మరువలేనిదన్నారు. సమాజంలో అణచివేతపై పోరాడటమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ రాష్ట్ర నాయకుడు ఎండి. పాషా, ప్రజానాట్యమండలి యాదాద్రి జిల్లా గౌరవ అధ్యక్షుడు గోశిక కరుణాకర్, జీఎంపీఎస్ చౌటుప్పల్ మండల అధ్యక్షుడు భీమనగోని బాలరాజ్, ఉపాధ్యక్షుడు గజ్జి పాండు, సహాయ కార్యదర్శి గడగోటి జంగయ్య, నాయకులు భక్తుల దాసు, బావుండ్లపల్లి స్వామి, బొడ్డు అంజిరెడ్డి, చప్పిడి శ్రీనివాస్ రెడ్డి, కొండే రాజమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# విశాలభారతి పాఠశాలలో వనమహోత్సవం

- పర్యావరణాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత: కౌన్సిలర్ పాక చిరంజీవి



**తొలివెలుగు, చౌటుప్పల్:** స్థానిక విశాలభారతి హైస్కూల్లో శనివారం వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన 12వ వార్డు కౌన్సిలర్ పాక చిరంజీవి.. పాఠశాల కరస్పాండెంట్ వీసం చైతన్య క్రాంతి వర్ధన్ రెడ్డితో కలిసి పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ చిరంజీవి మాట్లాడుతూ.. ప్రకృతిని కాపాడితేనే మానవ మనుగడ సాధ్యమవుతుందన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలన్నారు. పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ అశోక్ కుమార్, ప్రధానోపాధ్యాయులు ముత్యం శ్రీనివాస్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# రైతులకు ఉచితంగా పత్తి విత్తనాల పంపిణీ





- సాంకేతిక సలహాలతో సాగు చేసి లాభాలు గడించాలి
- రైతు వేదికలో జాతీయ పత్తి ఉత్పాదకత మిషన్ కార్యక్రమం

**తొలివెలుగు, చౌటుప్పల్:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ పత్తి ఉత్పాదకత మిషన్‌లో భాగంగా శనివారం స్థానిక రైతు వేదికలో రైతులకు ఉచితంగా పత్తి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి (ఏఓ) ముత్యాల నాగరాజు మాట్లాడుతూ.. రైతులు ఈ పత్తి విత్తనాలను దగ్గర పంట పద్ధతి (90ఇ30 సెం.మీ) లేదా ఐసీఎమ్ (సమగ్ర పంట యాజమాన్యం - 90ఇ60 సెం.మీ) పద్ధతిలో విత్తుకోవాలని సూచించారు. మొక్కలు మితిమీరి ఎత్తు పెరగకుండా ఉండేందుకు 'మెపిక్వాట్ క్లోరైడ్' రసాయనాన్ని పిచికారీ చేసుకోవాలన్నారు. మిగిలిన యాజమాన్య పద్ధతులన్నీ సాధారణ పత్తి సాగు తరహాలోనే ఉంటాయని వివరించారు.

**ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి:**

మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పథకాలను రైతులు దుర్వినియోగం చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పీఏసీఎస్ చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ.. రైతులు వ్యవసాయ అధికారులు, విస్తరణ అధికారుల (ఏఈఓ) సేవలను వినియోగించుకోవాలన్నారు. సాంకేతిక సలహాలు పాటిస్తూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు గడించాలని సూచించారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం పత్తి, కంది విత్తనాలను సబ్సిడీపై అందిస్తోందని, ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జూలై 15 లోపు ఆరుతడి పంటల విత్తనాలను కూడా అందుబాటులోకి తెస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ అంజయ్య, మున్సిపల్ కౌన్సిలర్ రాకేష్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు), పాడి రైతులు, వ్యవసాయదారులు పాల్గొన్నారు.

# దొడ్డి కొమరయ్య అమరత్వం వెలకట్టలేనిది

- ఘనంగా 80వ వర్ధంతి వేడుకలు
- ట్యాంక్‌బండ్‌పై విగ్రహం ఏర్పాటు చేయాలి: జూకంటి ప్రవీణ్‌కుమార్



**తొలివెలుగు, రాజాపేట:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య 80వ వర్ధంతిని శనివారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కురుమ సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ విగ్రహ కూడలి వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో దొడ్డి కొమరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**పోరాట స్ఫూర్తి అజరామరం:**

ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జూకంటి ప్రవీణ్‌కుమార్, కురుమ సంఘం మండల అధ్యక్షుడు వస్పరి సుధాకర్ మాట్లాడుతూ... భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం సాగిన సాయుధ పోరాటంలో దొడ్డి కొమరయ్య చూపిన తెగువ, త్యాగం అజరామరమని కొనియాడారు. ఆయన పోరాట క్రమాన్ని నేటి పౌర సమాజం స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. హైదరాబాదులోని ట్యాంక్‌బండ్‌పై దొడ్డి కొమరయ్య నిలువెత్తు విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని, జనగామ జిల్లాకు ఆయన పేరు పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు దొడ్డి కొమరయ్య పేరిట మెరిట్ స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయాలన్నారు.

**ఈ నెల మూడో వారంలో విగ్రహావిష్కరణ:**

ఈ నెల మూడో వారంలో రాజాపేట మండల కేంద్రంలో దొడ్డి కొమరయ్య విగ్రహావిష్కరణ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు వారు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి అన్ని రాజకీయ పక్షాల, కుల సంఘాల నాయకులు, మేధావులు, యువత పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కురుమ సంఘం నేతలు గవ్వల సిద్ధేశ్వర్, కోరె మల్లేశం, కాకల్ల భరత్, మాయకోటి రాజు, జూకంటి సత్యం, అఖిలపక్ష నేతలు బొడ్డుపల్లి చంద్రశేఖర్, ఎర్రగోకుల జస్వంత్, బెడిద నర్సింలు, గణేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# దొడ్డి కొమురయ్య ఆశయాలను సాధించాలి

- గుండంరాజుపల్లిలో విగ్రహావిష్కరణ
- గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిల్లె గోపాల్



**తొలివెలుగు, చిన్నగూడూరు:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్యను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్ర గొర్రెలు, మేకల పెంపకందారుల సహకార సంఘం అధ్యక్షుడు కిల్లె గోపాల్ అన్నారు. దొడ్డి కొమురయ్య వర్ధంతిని పురస్కరించుకుని మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలం గుండంరాజుపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆయన విగ్రహాన్ని శనివారం సంఘం రాష్ట్ర కార్యదర్శి ఉడుత రవీందర్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కిల్లె గోపాల్ మాట్లాడుతూ.. భూస్వామ్య ఆధిపత్యానికి వ్యతిరేకంగా, పటేల్, పట్వారీ వ్యవస్థల అంతానికి కొమురయ్య చేసిన పోరాటం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీఎంపీఎస్ గ్రామ సొసైటీ అధ్యక్షుడు పయ్యావుల మల్లయ్య, సర్పంచ్ గునిగంటి కమలాకర్, జిల్లా కార్యదర్శి బొల్లం అశోక్, కడెం లింగయ్య, చెక్కల శ్రీను, ఉప్పలయ్య, జక్కుల యాకన్న, యాదవ సంఘం నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# భర్తను హతమార్చిన భార్య, ప్రియుడు

- 24 గంటల్లోనే కేసు మిస్టరీ ఛేదించిన ములుగు పోలీసులు
- ముగ్గురు నిందితుల అరెస్ట్, కారు, మొబైల్లు స్వాధీనం

**తొలివెలుగు, ములుగు/రాజాపేట:** అక్రమ సంబంధానికి అడ్డంగా ఉన్నాడనే నెపంతో ఓ భార్య, తన ప్రియుడితో కలిసి భర్తను దారుణంగా హత్య చేయించిన ఉదంతం కలకలం రేపింది. ఈ ఘోర హత్య కేసు మిస్టరీని ములుగు పోలీసులు కేవలం 24 గంటల్లోనే ఛేదించారు. శనివారం ములుగు సీ.ఐ సురేష్ కుమార్ సీ.సీ.ఎస్ బృందంతో కలిసి వివరాలను మీడియాకు వెల్లడించారు.

**మిషన్ భగీరథ ట్యాంక్ వద్ద మృతదేహం:**

గత నెల (జూన్) 26వ తేదీ మధ్యాహ్నం ములుగు సమీపంలోని జాకారం శివారు మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ వెనుక గల వ్యవసాయ భూమిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. జాకారం గ్రామ కారోబార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ములుగు జిల్లా ఎస్పీ ఆదేశాల ప్రకారం సీ.ఐ, సీ.సీ.ఎస్ పోలీసులు ఏడు బృందాలుగా విడిపోయి సాంకేతిక, శాస్త్రీయ పరిజ్ఞానంతో దర్యాప్తు చేపట్టారు. మృతుడు యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండల కేంద్రానికి చెందిన సిరిపంగ నరసింహులు (42) గా గుర్తించారు.



**విచారణలో దిగ్భ్రాంతికర నిజాలు:**

మృతుడి భార్య శోభారాణికి, తాపీ మేస్త్రి అలా పెద్ద వెంకటేశ్వర్లుకు మధ్య ఉన్న అక్రమ సంబంధమే ఈ హత్యకు దారితీసినట్లు విచారణలో తేలింది. వీరిద్దరూ కలిసి పథకం ప్రకారం నరసింహులును హతమార్చారు. ఈ క్రైమ్‌లో వీరికి సహాయం చేసిన మరో తాపీ మేస్త్రి నీల దుర్గారెడ్డిని కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి ఏపీ 10 ఏపీ 5631 నంబర్ గల సాంట్రో కారు, మూడు సెల్‌ఫోన్లు, హత్యకు వాడిన నైలాన్ తాడు, బండరాయిని స్వాధీనం చేసుకున్నారు. తక్కువ సమయంలోనే కేసును ఛేదించిన పోలీస్ బృందాన్ని జిల్లా పోలీస్ అధికారి ప్రత్యేకంగా అభినందించారు.



జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..





## ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి

- తహసీల్దార్‌కు 'తపస్' వినతిపత్రం అందజేత

**తొలివెలుగు, రాజాపేట:** ఉపాధ్యాయుల దీర్ఘకాలిక పెండింగ్ సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) నాయకులు డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర శాఖ పిలుపు మేరకు చేపట్టిన దశలవారీ ఉద్యమంలో భాగంగా శనివారం రాజాపేట తహసీల్దార్ గోలి రవికిరణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు సంబంధించిన పీఆర్సీ నివేదికను, పెండింగ్‌లో ఉన్న 6 డీఏలను వెంటనే ప్రకటించాలని కోరారు. అలాగే ప్రభుత్వ ముద్రణాలయం, ట్రెజరీల్లో నిలిచిపోయిన ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నూతన పెన్షన్ విధానాన్ని (సీపీఎస్) రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకే మొదటి దశ పోరాటంలో భాగంగా తహసీల్దార్‌కు మెమోరండం సమర్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తపస్ మండల శాఖ అధ్యక్షుడు దుడుకు జానయ్య, ప్రధాన కార్యదర్శి పున్న సత్యానంద్, నాయకులు నెమిల భరత్ కుమార్ గౌడ్, జిల్లా బాధ్యులు పలుగుల రాజు, కటకం నాందేవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా దొడ్డి కొమురయ్య వర్ధంతి



**తొలివెలుగు, రాజాపేట:** మండల పరిధిలోని బొందుగుల గ్రామంలో శనివారం తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి వేడుకలను కురుమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ.. దొరల గడీలను, వెట్టిచాకిరీని ఎదిరించి నిలిచిన అపర వీరుడు దొడ్డి కొమురయ్య అని కొనియాడారు. కేవలం 19 ఏళ్ల ప్రాయంలోనే భూస్వామ్య రౌడీ మూకల తుపాకీ గుళ్లకు ఎదురొడ్డి, రైతాంగ సాయుధ పోరాటానికి ప్రథమ బలిదానమైన ఆయన త్యాగం మరువలేనిదన్నారు. రాచరిక వ్యవస్థపై పిడికిలి బిగించిన ఆ వీరుడి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బొందుగుల కురుమ సంఘం అధ్యక్షుడు బండ ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు మర్ల సమ్మయ్య, బీరప్ప యూత్ అధ్యక్షుడు జెట్ట శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు బాల్ద శ్రీకాంత్, పెద్ద కురుమ బాల్ద యాదగిరి, మర్ల మల్లేశం, మాపు భాస్కర్ తదితర కులబాంధవులు పాల్గొన్నారు.

## గురుకుల ఇంటర్ సీట్ల భర్తీకి 6న స్పాట్ అడ్మిషన్లు

- యాదాద్రి జిల్లాలోని 7 గురుకులాలకు ఒకే చోట కౌన్సెలింగ్
- అవసరమైన పత్రాలతో హాజరుకావాలని జిల్లా కో-ఆర్డినేటర్ పిలుపు

**తొలివెలుగు, యాదాద్రిభువనగిరి:** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల ఆధ్వర్యంలో 2026-27 విద్యా సంవత్సరానికి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో మిగిలిపోయిన సీట్ల భర్తీకి ఈ నెల 6న (సోమవారం) స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు సొసైటీ అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

**ఒకే కేంద్రంలో కౌన్సెలింగ్:**

యాదాద్రి భువనగిరి జిల్లాలోని మొత్తం 7 గురుకుల విద్యాసంస్థలకు (3 బాలుర, 4 బాలికల) సంబంధించిన స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియను వలిగొండ (బీబీనగర్) గురుకుల బాలికల పాఠశాల, జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఒకే కేంద్రంగా నిర్వహించనున్నారు.

**ఖాళీలు ఉన్న కళాశాలల వివరాలు:**

- బాలుర విభాగం: భువనగిరి, రాజాపేట, మోత్కూర్.
- బాలికల విభాగం: రామన్నపేట, ఆలేరు, చౌటుప్పల్, వలిగొండ.

**అర్హతలు - అవసరమైన పత్రాలు:**

మార్చి 2026లో పదో తరగతి (ఎస్సెస్సీ) ఉత్తీర్ణులైన విద్యార్థులు మాత్రమే ఈ కౌన్సెలింగ్‌కు అర్హులు. అభ్యర్థులు తమ బదిలీ పత్రం (టీసీ), ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, ఎస్సెస్సీ మార్కుల మెమోతో పాటు ఇతర ఒరిజినల్ సర్టిఫికెట్లతో సోమవారం ఉదయం 9:00 గంటలకల్లా కౌన్సెలింగ్ కేంద్రానికి హాజరుకావాలని జిల్లా సమన్వయ అధికారి కోరారు.

## నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

- సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మార్కెట్ యార్డులో నిర్వహణ
- ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నవీన్ గౌడ్ పిలుపు



**తొలివెలుగు, చౌటుప్పల్:** గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన నేత్ర వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం చౌటుప్పల్ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కాటెపల్లి నవీన్ గౌడ్ తెలిపారు. ఈ శిబిరాన్ని మునుగోడు నియోజకవర్గ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రారంభించనున్నట్లు ఆయన వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సుశీలమ్మ ఫౌండేషన్ నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారు ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని, రాజకీయాలకు అతీతంగా ప్రజలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాటెపల్లి నవీన్ గౌడ్ కోరారు.

# వానాకాలం వ్యవసాయ సాగుకు అధికార యంత్రాంగం సన్నద్ధం కావాలి

- విత్తనాలు, ఎరువులు, ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి: సీఎస్ సంజయ్ జాజు
- వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అధికారులకు పలు కీలక ఆదేశాలు





**తొలివెలుగు, చౌటుప్పల్/భువనగిరి:** రాష్ట్రంలో వానాకాలం వ్యవసాయ సాగు విజయవంతం అయ్యేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో వ్యవసాయం, విత్తనాలు, ఎరువులు, ప్రజారోగ్యం, రైతు రిజిస్ట్రీ, తాగునీరు, విద్య, ఉద్యానవనం, సూక్ష్మ సాగునీరు, ఆయిల్ పామ్ విస్తరణ, మధ్యాహ్న భోజన పథకం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 2026 వానాకాలం సీజన్‌లో 138.49 లక్షల ఎకరాల్లో సాగు లక్ష్యంగా నిర్ణయించామని, రైతులకు అవసరమైన 99.13 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. నకిలీ విత్తనాల విక్రయాలపై ప్రత్యేక నిఘా కొనసాగించాలని, జూలై నెలకు అవసరమైన ఎరువులను ముందుగానే నిల్వ ఉంచడంతో పాటు యూరియా అక్రమ రవాణా, నిల్వలు, అధిక ధరలకు విక్రయాలపై తనిఖీలు నిర్వహించాలని సూచించారు. నానో యూరియా వినియోగాన్ని కూడా విస్తృతంగా ప్రోత్సహించాలని అధికారులకు ఆదేశించారు. రైతు రిజిస్ట్రీ కార్యక్రమంలో రాష్ట్రం దేశంలోనే ముందంజలో ఉందని పేర్కొంటూ, అర్హులైన ప్రతి రైతు నమోదు పూర్తయ్యేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. వరితో పాటు పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలని, ఆయిల్ పామ్, ఉద్యాన పంటలు, సూక్ష్మ సాగునీటి ప్రాజెక్టుల అమలును వేగవంతం చేయాలని తెలిపారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నివారణపై అప్రమత్తంగా ఉండాలని, అన్ని జిల్లాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. డెంగ్యూ, చికెన్‌గున్యా, మలేరియా నియంత్రణ చర్యలతో పాటు టైఫాయిడ్ నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రతి శుక్రవారం 'డ్రై డే' కార్యక్రమం నిర్వహిస్తూ పారిశుద్ధ్య చర్యలను ముమ్మరం చేయాలని సూచించారు. గర్భిణుల ఆరోగ్య సంరక్షణ, ఆసుపత్రుల్లో మందులు, పరీక్షా కిట్లు, రక్త నిల్వలు, అంబులెన్స్ సేవలు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారం, మధ్యాహ్న భోజన పథకాలను నాణ్యతతో అమలు చేయాలని, పరిశుభ్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సీఎస్ సూచించారు. విద్యార్థుల హాజరుకు అనుగుణంగా ఆహార పంపిణీ చేపట్టి, డిజిటల్ డ్యాష్‌బోర్డ్ ద్వారా పథకం అమలును పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి జిల్లా అధికారులతో మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచడంతో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించాలని సూచించారు. రైతు నమోదు ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాలని, తాగునీటి సరఫరాపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలను క్రమం తప్పకుండా సందర్శిస్తూ విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కృతిక, సాత్విక్, జిల్లా వ్యవసాయ అధికారి రమణారెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మనోహర్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా విద్యాధికారి భిక్షపతి, మిషన్ భగీరథ ఈఈతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# విద్యకు దూరం.. సంపాదనకు చేరువు!

- పుట్టగూడెం తండా విద్యార్థుల తీరుపై సర్పంచ్ ఆవేదన
- క్యాటరింగ్ పనుల వైపు బాలల మొగ్గు

విద్యకు దూరం.. సంపాదనకు చేరువు! క్యాటరింగ్ పనుల వైపు బాలల మొగ్గు




**తొలివెలుగు, రాజాపేట:** మండల పరిధిలోని గిరిజన తండా పుట్టగూడెం గ్రామ విద్యార్థులు విద్యాభ్యాసానికి దూరమవుతున్నారు. తాత్కాలిక సంపాదనకు అలవాటు పడి చదువును నిర్లక్ష్యం చేస్తుండటం స్థానికంగా ఆందోళన కలిగిస్తోంది. సెలవు దినాల్లో అలవాటైన ధనార్జనను చదువుల సమయంలోనూ కొనసాగిస్తూ పక్కతోవ పడుతున్నారని గ్రామ సర్పంచ్ రామ్‌జీ నాయక్ పలు సందర్భాల్లో ఆవేదన వ్యక్తం చేశారు.

**భవిష్యత్తును పాడుచేసుకోవద్దు:**

గిరిజన విద్యార్థులకు చదువుకుంటే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, ప్రభుత్వపరంగా ఎన్నో అవకాశాలు ఉన్నాయని సర్పంచ్ రాంజీ నాయక్ పిల్లలకు, వారి తల్లిదండ్రులకు నిరంతరం అవగాహన కల్పిస్తూనే ఉన్నారు. అయినప్పటికీ, తండాలోని కొందరు విద్యార్థులు చదువు కంటే డబ్బు సంపాదనకే ప్రాధాన్యం ఇస్తున్నారు. వివిధ శుభకార్యాలు, ఫంక్షన్ హాళ్లలో క్యాటరింగ్ వద్దన పనులకు వెళ్తూ రోజువారీ సంపాదనకు అలవాటు పడుతున్నారు. దీంతో వారికి చదువుపై ఆసక్తి తగ్గి, బడులకు డుమ్మా కొడుతున్నారు. పిల్లల్లో మార్పు వచ్చే వరకు తాను ఈ ప్రయత్నాన్ని విడిచిపెట్టబోనని సర్పంచ్ స్పష్టం చేశారు. ఈ విషయంలో పోలీసు, విద్యాశాఖ అధికారులు స్పందించి, తగిన అవగాహన సదస్సులు నిర్వహించి సహకరించాలని ఆయన కోరారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

- గ్రామీణ విద్యార్థులకు ఆర్టీసీ రవాణా సౌకర్యం కల్పించాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్
- విద్యాశాఖ మంత్రిని వెంటనే నియమించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి



**తొలివెలుగు, చౌటుప్పల్:** పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయడంతో పాటు గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు మెరుగైన ఆర్టీసీ రవాణా సౌకర్యం కల్పించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) చౌటుప్పల్ మండల కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. అలాగే రాష్ట్రానికి పూర్తి స్థాయి విద్యాశాఖ మంత్రిని తక్షణమే నియమించాలని కోరింది. చౌటుప్పల్ మండల కమిటీ ఆధ్వర్యంలో జేబీఎం జూనియర్ కళాశాల, అరవిందో జూనియర్ కళాశాలల్లో శనివారం నిర్వహించిన విద్యార్థుల స్వాగత సభలో ఈ మేరకు పలు డిమాండ్లు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి తిగుళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా విద్యార్థులకు ఇచ్చిన హామీలు అమలు కాలేదని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి జూనియర్ కళాశాలలకు వచ్చే విద్యార్థులకు సరిపడా ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో ప్రతిరోజూ ఇబ్బందులు పడుతున్నారని, ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసి రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్యారంగానికి సంబంధించిన అనేక సమస్యలు ఉన్నప్పటికీ పూర్తి స్థాయి విద్యాశాఖ మంత్రిని ఇప్పటికీ నియమించకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యారంగాన్ని ప్రభుత్వం ప్రాధాన్యంగా తీసుకుని ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడంతో పాటు విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు సుర్వి అరవింద్, పోలేపల్లి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# చల్లూరు పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలి

- పంచాయతీరాజ్ కమిషనర్‌కు కొల్లి శ్రీనివాస్ ఫిర్యాదు

**తొలివెలుగు, రాజాపేట:** మండల పరిధిలోని చల్లూరు గ్రామానికి చెందిన గత, ప్రస్తుత పంచాయతీ కార్యదర్శులపై తక్షణమే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ కొల్లి శ్రీనివాసరావు శనివారం పంచాయతీరాజ్ శాఖ కమిషనర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం...

**తప్పుడు నివేదికలతోనే సమస్యలు:**

చల్లూరు గ్రామంలోని సర్వే నెంబర్ 322లో గల 70.240 ఎకరాల భూమిలో లేఅవుట్ అనుమతుల కోసం 'శ్రీ కన్‌స్ట్రక్షన్స్ అండ్ డెవలపర్స్ ఇ అదర్స్' ప్రతినిధులు 2019లో దరఖాస్తు చేసుకున్నారు. అప్పట్లో చల్లూరు పంచాయతీ కార్యదర్శి క్షేత్రస్థాయి పరిశీలన పేరిట ఎలాంటి సేల్ డీడ్‌లు, ఈసీలను సరిగ్గా తనిఖీ చేయకుండానే యాదాద్రి డీటీసీపీ కార్యాలయానికి నివేదిక పంపారు. అక్కడ నుంచి ఫైలు హైదరాబాద్ డీటీసీపీకి చేరడంతో 19-06-2019న (టీఎల్‌పీ నెం. 112/2019/హెచ్) లేఅవుట్ అనుమతులు మంజూరయ్యాయి. ఈ లేఅవుట్ పరిధిలోకి శ్రీకర్ హోమ్స్, ఆర్.ఆర్. హై ఎనర్జిటిక్స్, సి.హెచ్. శ్రీకృష్ణ రాజేశ్వరి తదితరులు భాగస్వాములుగా ఉన్నారని శ్రీనివాస్ పేర్కొన్నారు.

**కోర్టు ఆదేశాలూ బేఖాతర్!**

సదరు లేఅవుట్‌లో తన స్వంత భూమిని కూడా కలిపేసుకున్నారని బాధితుడు శ్రీనివాస్ గత ఏడాది (25-09-2025) తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు ఆదేశాల మేరకు హైదరాబాద్ డీటీసీపీ అధికారులు తదుపరి చర్యల కోసం యాదాద్రి భువనగిరి జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ)కి ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలోనే డీపీఓ కార్యాలయం నుంచి 07-02-2026న చల్లూరు పంచాయతీ కార్యదర్శికి ఉత్తర్వులు అమలు చేయాలంటూ మెమో అందింది. అయితే, ఉన్నతాధికారుల ఆదేశాలను సైతం లెక్కచేయకుండా పంచాయతీ కార్యదర్శి చట్టాన్ని ఉల్లంఘిస్తున్నారని శ్రీనివాస్ ఆరోపించారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల సుమారు 600 మంది అమాయక వినియోగదారులు ప్లాట్లు కొనుగోలు చేసి రోడ్డున పడ్డారని, బాధ్యులైన కార్యదర్శులపై కఠిన చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# నేడే ఉచిత కంటి వైద్య శిబిరం

- ప్రారంభించనున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి
- మాజీ మున్సిపల్ అధ్యక్షుడు సుర్వి నరసింహ గౌడ్



**తొలివెలుగు, చౌటుప్పల్:** కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చౌటుప్పల్ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఆదివారం (నేడు) ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఈ శిబిరాన్ని మునుగోడు నియోజకవర్గ శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రారంభించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మాజీ మున్సిపల్ అధ్యక్షుడు సుర్వి నరసింహ గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

**ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి:**

గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలు, వృద్ధులు కంటి చూపు సమస్యలతో నిత్యం ఇబ్బందులు పడుతున్నారని, వారికి అండగా నిలిచేందుకు సుశీలమ్మ ఫౌండేషన్ నిరంతరం కృషి చేస్తోందని సుర్వి నరసింహ గౌడ్ పేర్కొన్నారు. ఈ శిబిరంలో నిపుణులైన వైద్యులచే ఉచితంగా కంటి పరీక్షలు చేసి, అవసరమైన వారికి తగిన చికిత్సలు అందిస్తారన్నారు. నియోజకవర్గ పరిధిలోని ప్రజలు, లబ్ధిదారులు రాజకీయాలకు అతీతంగా ఈ ఉచిత కంటి వైద్య శిబిరానికి హాజరై, విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# భవిత కేంద్రాన్ని సందర్శించిన బీఆర్ఎస్వీ నాయకులు

- ప్రత్యేక అవసరాల పిల్లలు సమాజానికి భారం కాదు: నలపరాజు రమేష్



**తొలివెలుగు, చౌటుప్పల్:** సమగ్ర శిక్ష తెలంగాణ ఆధ్వర్యంలో చౌటుప్పల్ మండల కేంద్రంలో నిర్వహిస్తున్న 'భవిత' ప్రత్యేక అవసరాలుగల పిల్లల వనరుల కేంద్రాన్ని శనివారం బీఆర్ఎస్వీ మునుగోడు నియోజకవర్గ అధ్యక్షుడు నలపరాజు రమేష్ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా కేంద్రంలో చిన్నారులు ప్రదర్శించిన చిత్రలేఖనం, ఆటపాటలు, కళానైపుణ్యాలను వారు ప్రత్యక్షంగా తిలకించి, వారి ప్రతిభను అభినందించారు.

**పిల్లల చిరునవ్వే ఆశాదీపం:**

అనంతరం బీఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు నలపరాజు రమేష్ మాట్లాడుతూ.. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు సమాజానికి ఏమాత్రం భారం కాదని, వారంతా దేశ భవితకు వారధులని పేర్కొన్నారు. చిన్నారులలో దాగి ఉన్న విలక్షణ ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించాల్సిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భవిత కేంద్రాల ద్వారా ఇలాంటి పిల్లలకు మరింత నాణ్యమైన విద్య, వైద్యం, ఫిజియోథెరపీ సేవలను అందిస్తూ కొండంత భరోసాగా నిలవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ మునుగోడు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఒంటెద్దు లింగస్వామి, కార్యదర్శి ముటుకులోజు రాఘవ, కోశాధికారి ఎండీ ఫరన్, ఫిజియోథెరపీ డాక్టర్ గుండేబోయిన రమేష్ యాదవ్ పాల్గొన్నారు.

# దొడ్డి కొమురయ్య ఆశయాలను కొనసాగించాలి

- 81వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు
- జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ల పిలుపు





**తొలివెలుగు, చౌటుప్పల్/భువనగిరి:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు పిలుపునిచ్చారు. దొడ్డి కొమురయ్య 81వ వర్ధంతి సందర్భంగా శనివారం జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన నివాళుల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డితో కలిసి దొడ్డి కొమురయ్య చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేసి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం భాస్కర్ రావు మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో తొలి అమరవీరుడిగా నిలిచిన దొడ్డి కొమురయ్య ఆశయాలు నేటికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. రైతాంగం, వెనుకబడిన వర్గాల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన చూపిన మార్గంలో పనిచేసే అవకాశం లభించడం గర్వకారణమని పేర్కొన్నారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి మాట్లాడుతూ.. యువత దొడ్డి కొమురయ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని సమాజాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య విలువలు, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి సుబ్బారెడ్డి, వివిధ కుల సంఘాల నాయకులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మాట నిలబెట్టుకున్నారు.. బడి భవనం కట్టించారు!





- ఆరు నెలల్లోనే అల్లందేవిచెర్వులో నాలుగు క్లాస్ రూమ్‌ల నిర్మాణం
- రూ.30 లక్షలతో నిర్మించిన ప్రభుత్వ పాఠశాల భవనం ప్రారంభం
- ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఇఎల్‌వి భాస్కర్ ఉదారత
- విద్యాభివృద్ధికి ప్రభుత్వ పాఠశాలల బలోపేతం అవసరం: డాక్టర్. ఇఎల్‌వి భాస్కర్

**తొలివెలుగు, సంస్థాన్ నారాయణపురం:** మండలంలోని అల్లందేవిచెర్వు గ్రామంలో ఇఎల్‌వి భాస్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.30 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనాన్ని ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్. ఇఎల్‌వి భాస్కర్ శనివారం ప్రారంభించారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రచార సమయంలో గ్రామాన్ని సందర్శించిన సందర్భంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఒకే గదిలో కొనసాగుతోందని గ్రామ సర్పంచ్ సుర్వి సౌజన్య రాజు గౌడ్ ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన డా. భాస్కర్, సౌజన్య రాజు గౌడ్ సర్పంచ్‌గా ఎన్నికైతే గ్రామానికి నూతన పాఠశాల భవనాన్ని నిర్మించి అందజేస్తానని హామీ ఇచ్చారు. హామీ మేరకు సర్పంచ్ ఎన్నికైన అనంతరం శంకుస్థాపన చేసి, కేవలం ఆరు నెలల వ్యవధిలోనే నాలుగు తరగతి గదులతో కూడిన ఆధునిక భవనాన్ని నిర్మించి గ్రామ ప్రజలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్. ఇఎల్‌వి భాస్కర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలంటే తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడంతో పాటు, పేరెంట్ – టీచర్ సమావేశాలకు క్రమం తప్పకుండా హాజరై వారి విద్యాభివృద్ధిపై శ్రద్ధ వహించాలని సూచించారు. భవిష్యత్తులో ఇఎల్‌వి భాస్కర్ ఫౌండేషన్ ద్వారా విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. అనంతరం గ్రామ సర్పంచ్ సుర్వి సౌజన్య రాజు గౌడ్, మండల విద్యాధికారి గోలి శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు కనక శీను, చైర్మన్ సుర్వి అలివేలు నగేష్ గౌడ్, ఉపసర్పంచ్ ముక్కర్ల కవిత స్వామి యాదవ్, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులతో కలిసి నూతన భవనంలోని నాలుగు తరగతి గదులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ లారీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బూడిద నందారెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, మండల అధికారులు, ఇఎల్‌వి భాస్కర్ ఫౌండేషన్ ప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆకతాయిల వేధింపులుంటే అస్సలు భయపడొద్దు!

- సమస్యలొస్తే న్యాయ సేవా సంస్థను ఆశ్రయించండి
- జనంపల్లి గురుకుల పాఠశాలలో విద్యార్థులకు న్యాయ అవగాహన సదస్సు
- విద్యార్థులు విద్యతో పాటు సామాజిక బాధ్యతలపై దృష్టి పెట్టాలని పిలుపు
- జనంపల్లి గురుకుల సదస్సులో సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ సత్తయ్య



**తొలివెలుగు, రామన్నపేట:** రామన్నపేట మండల పరిధిలోని జనంపల్లి గురుకుల పాఠశాలలో శనివారం విద్యార్థులకు ప్రత్యేక న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ దంతూరి సత్తయ్య ముఖ్య అతిథిగా హాజరుకాగా, ప్యానల్ అడ్వకేట్లు బర్ల డేవిడ్, మామిడి వెంకట్‌రెడ్డి, కునూరు శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేజిస్ట్రేట్ దంతూరి సత్తయ్య మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించేలా కృషి చేయాలని సూచించారు. విద్య ద్వారానే ప్రపంచాన్ని మార్చే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు ఎదుర్కొనే ఏ సమస్యనైనా వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం పొందాలని సూచించారు. విద్యా హక్కు చట్టం, బాలకార్మిక నిరోధక చట్టం, బాల్య వివాహాల నిషేధం, పోక్సో చట్టం, కార్మిక చట్టాలు, మాదకద్రవ్యాల నియంత్రణ తదితర అంశాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పాఠశాలలో లేదా రాకపోకల సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్, స్థానిక పోలీస్ స్టేషన్ లేదా మండల న్యాయ సేవా సంస్థను సంప్రదించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ భయపడవద్దని విద్యార్థులకు సూచించారు. చెడుకు దారి తీసే ఆలోచనలకు దూరంగా ఉండి చదువుపై దృష్టి సారించాలని, మంచి నిర్ణయాలు తీసుకునే వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. సమాజంలో తమ హక్కులు, బాధ్యతలపై అవగాహనతో బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో లీగల్ సర్వీసెస్ టీమ్ సభ్యులు బత్తుల గణేష్, కానుగంటి శ్రీశైలం, పాఠశాల ప్రిన్సిపాల్ కె. నాగమ్మ, ఏటీపీ డి. సునీత, డిప్యూటీ వార్డెన్ బి. పల్లవి, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ జె. కృష్ణవేణి, హేమలత, డి. మంజుల, పి. గంగమ్మ, పోలీసు సిబ్బంది రాఘవేందర్, కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# దొడ్డి కొమురయ్యకు కురుమ సంఘం ఘన నివాళి

- వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు సమర్పణ
- ఆయన పోరాట స్ఫూర్తి భావితరాలకు ఆదర్శం: నాయకులు

తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతిని పురస్కరించుకుని శనివారం భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కురుమ సంఘం ఉపాధ్యక్షుడు బుగ్గ లక్ష్మయ్య దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, తెలంగాణ తొలి దశ రైతాంగ ఉద్యమంలో దొడ్డి కొమురయ్య ప్రదర్శించిన వీరత్వం, త్యాగం భావితరాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు తంగళ్ల మహేష్, మైలా ముత్యాలు, కాలిన భాను మైలా తదితరులు పాల్గొన్నారు.



# ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విద్యార్థికి ఇఎల్‌వి ఫౌండేషన్ చేయూత

- రూ.10 వేల ఫీజు బకాయిలు చెల్లించి సర్టిఫికెట్లు అందజేత
- ఉన్నత విద్యకు ఆటంకం తొలగించిన ఫౌండేషన్

**తొలివెలుగు, చౌటుప్పల్:** ఆర్థిక ఇబ్బందులతో పాఠశాల ఫీజు బకాయిలు చెల్లించలేక సర్టిఫికెట్లు పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఓ పదో తరగతి విద్యార్థికి ఇఎల్‌వి ఫౌండేషన్ అండగా నిలిచి మానవతను చాటుకుంది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని సాంజాన్ విద్యానికేతన్ ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసిన కానుగు అభిమన్యు ఫీజు బకాయిలు చెల్లించలేకపోవడంతో, పాఠశాల యాజమాన్యం టీసీ, బోనఫైడ్ తదితర సర్టిఫికెట్లను నిలిపివేసింది. ఈ విషయాన్ని తెలుసుకున్న ఇఎల్‌వి టీం సభ్యుడు మార్గం శివకుమార్ యాదవ్, ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఇరుగదిండ్ల భాస్కర్ దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థి ఉన్నత విద్యకు ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతో స్పందించిన భాస్కర్, ఫౌండేషన్ తరఫున రూ.10 వేల ఫీజు బకాయిలను పాఠశాల యాజమాన్యానికి చెల్లించి, విద్యార్థికి టీసీ, బోనఫైడ్ సర్టిఫికెట్లు అందేలా చర్యలు తీసుకున్నారు. సకాలంలో స్పందించి విద్యార్థి భవిష్యత్తుకు అండగా నిలిచిన ఇఎల్‌వి ఫౌండేషన్ నిర్వాహకులను స్థానికులు, పలువురు విద్యావేత్తలు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇఎల్‌వి ఫౌండేషన్ డైరెక్టర్ అశోక్, నోముల సత్తిరెడ్డి, బండమీది కిరణ్, రాచకొండ మల్లేష్, ఇఎల్‌వి టీం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# దొడ్డి కొమురయ్య ఆశయాల సాధనకు కృషి చేస్తాం



- సీపీఎం కార్యాలయంలో 81వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు
- ప్రజల హక్కుల పరిరక్షణకు ఉద్యమాలు కొనసాగిస్తాం: గోశిక కరుణాకర్

**తొలివెలుగు, చౌటుప్పల్:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య ఆశయాలను నేటి తరానికి చేరవేసి, వాటి సాధన కోసం నిరంతరం పోరాడుతామని సీపీఎం చౌటుప్పల్ మున్సిపల్ కార్యదర్శి గోశిక కరుణాకర్ అన్నారు. దొడ్డి కొమురయ్య 81వ వర్ధంతి సందర్భంగా శనివారం చౌటుప్పల్ పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో గోశిక కరుణాకర్ మాట్లాడుతూ, భూస్వామ్య దోపిడి, సామాజిక అన్యాయాలకు వ్యతిరేకంగా ప్రాణత్యాగం చేసిన దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తి నేటికీ ప్రజలకు మార్గదర్శకమని అన్నారు. రైతులు, కార్మికులు, పేద ప్రజల హక్కుల పరిరక్షణతో పాటు వారి సంక్షేమం కోసం సీపీఎం పార్టీ నిరంతరం ఉద్యమాలు కొనసాగిస్తోందని తెలిపారు. దొడ్డి కొమురయ్య ఆశయాలకు అనుగుణంగా సమానత్వ సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ పాషా, పార్టీ నాయకులు బండారు నరసింహ, బత్తుల దాసు, బొడ్డు అంజిరెడ్డి, భావనలపల్లి స్వామి, బొడ్డు రాజు, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, బత్తుల లక్ష్మయ్య, కొండె శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా అభివృద్ధికి శ్రీ వెంకటేశ్వర ఉన్నత పాఠశాల పరిశీలన

- రాష్ట్ర స్థాయి అధికారుల బృందం సందర్శన
- మౌలిక వసతులు, అభివృద్ధి పనులపై సమీక్ష

**తొలివెలుగు, వలిగొండ:** తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా అభివృద్ధి చేసే కార్యక్రమంలో భాగంగా వలిగొండ మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర ఉన్నత పాఠశాలను రాష్ట్ర స్థాయి అధికారుల బృందం శనివారం సందర్శించింది. ఈ సందర్భంగా రాష్ట్ర బృందంలోని ఎస్ఈ బాలప్రసాద్, డిప్యూటీ ఈఈ శివకుమార్, మండల విద్యాధికారి (ఎంఈఓ) ఎస్. భాస్కర్, ఏఈ అమరేందర్ రెడ్డి, సాంకేతిక సిబ్బందితో కలిసి పాఠశాల ఆవరణను క్షుణ్ణంగా పరిశీలించారు. పాఠశాల విస్తీర్ణం, తరగతి గదులు, సైన్స్, కంప్యూటర్ ప్రయోగశాలలు, అందుబాటులో ఉన్న మౌలిక వసతులు, ఇతర సదుపాయాలను పరిశీలించిన అధికారులు, తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా అభివృద్ధి పనులు పూర్తయితే విద్యార్థులకు మరింత మెరుగైన విద్యా వాతావరణం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు.

## రైతులకు ఉచితంగా పత్తి విత్తనాల పంపిణీ

- 'మిషన్ ఫర్ కాటన్ ప్రొడక్టివిటీ' కింద పంపిణీ
- శాస్త్రీయ విధానాలతో అధిక దిగుబడులు: అధికారులు



**తొలివెలుగు, వలిగొండ:** మిషన్ ఫర్ కాటన్ ప్రొడక్టివిటీ స్కీమ్‌లో భాగంగా వలిగొండ మండల రైతు వేదికలో శనివారం పత్తి సాగు రైతులకు ఉచిత పత్తి విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులకు సుమారు 225 ఎకరాల్లో డెమో ప్లాట్లు ఏర్పాటు చేసేందుకు అవసరమైన పత్తి విత్తనాలను ఉచితంగా అందజేశారు. ఈ డెమో ప్లాట్ల ద్వారా శాస్త్రీయ పద్ధతుల్లో పత్తి సాగు చేపట్టి అధిక దిగుబడులు సాధించేందుకు రైతులకు అవగాహన కల్పించనున్నట్లు అధికారులు తెలిపారు. పత్తి సాగులో ఆధునిక సాంకేతికత, సమగ్ర పంట యాజమాన్య పద్ధతులను అనుసరించడం ద్వారా ఉత్పాదకతను పెంచడంతో పాటు రైతుల ఆదాయాన్ని మెరుగుపరచడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అంజనీదేవి, నర్సయ్యగూడెం గ్రామ సర్పంచ్ పసాల జ్యోతి, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఎస్సీ సాధన మహాసభను విజయవంతం చేయాలి

- 9వ వార్షికోత్సవ మహాసభ కరపత్రం ఆవిష్కరణ
- రజకుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాన్ని కోరిన నాయకులు



**తొలివెలుగు, వలిగొండ:** జూలై 6న హైదరాబాద్‌లోని బైరామల్‌గూడ కేకే గార్డెన్స్‌లో నిర్వహించనున్న చాకలి ఎస్సీ సాధన సమితి 9వ వార్షికోత్సవ మహాసభను విజయవంతం చేయాలని సమితి రాష్ట్ర అధ్యక్షురాలు కొత్తకొండ శ్రీలక్ష్మి రజక సంఘ సభ్యులకు పిలుపునిచ్చారు. శనివారం భువనగిరిలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎలిమినేటి సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాసభ కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమంలో ఆమె పాల్గొని కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ.. రజకుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం రజక ఫెడరేషన్‌కు రూ.9 వేల కోట్ల నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. చాకలి కులస్తులను ఎస్సీ జాబితాలో చేర్చడంతో పాటు ప్రమాదాల్లో మరణించిన కుటుంబాలకు రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. భారతదేశంలోని 18 రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో చాకలి కులస్తులు ఎస్సీ జాబితాలో ఉన్నారని పేర్కొంటూ, అదే విధంగా తెలంగాణలోనూ చాకలి కులాన్ని ఎస్సీ జాబితాలో చేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముదిగొండ వెంకటప్పయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సట్టు నాగయ్య, నాయకులు అమనగంటి మల్లేశం, బాలరాజు, లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

## జిబ్లెక్‌పల్లిలో వివాహిత ఆత్మహత్య

- జిబ్లెక్‌పల్లి గ్రామంలో విషాద ఘటన
- పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభం



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** మండలంలోని జిబ్లెక్‌పల్లి గ్రామంలో ఓ వివాహిత మృతిచెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భాస్కర్ రెడ్డి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నడిగొండ మానస (30)కు సుమారు 12 సంవత్సరాల క్రితం గణేష్‌తో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. గణేష్ ఇనుప సామగ్రి వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వ్యాపార అవసరాల కోసం ఆటో రిక్షాను ఫైనాన్స్‌పై కొనుగోలు చేయడంతో అప్పులు పెరిగినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాల నేపథ్యంలో మానస తీవ్ర మనస్తాపానికి గురైనట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారని సమాచారం. శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమె ఉరి వేసుకున్నట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ భాస్కర్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## వైభవంగా శ్రీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు

- ప్రత్యేక పూజలు, హోమాలతో ఆధ్యాత్మిక శోభ
- స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించిన భక్తులు

**తొలివెలుగు, రామన్నపేట:** రామన్నపేట పట్టణంలోని ప్రసిద్ధ శ్రీ భూలీలా సమేత చెన్నకేశవ స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెల్ల రజనీ–వెంకటేష్ దంపతులు స్వామివారి మూలమూర్తులకు పట్టు వస్త్రాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన పవిత్ర హోమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీర్వాదాలు పొందారు. ఈ వేడుకల్లో గ్రామ సర్పంచ్ గరిక రాధిక సత్యనారాయణ, ఉపసర్పంచ్ మోటే రమేష్, ఆలయ చైర్మన్ ఉపేందర్ జానకి, కొంపల్లి సుమలత



సురేష్, సిందం లక్ష్మీబాయి లింగయ్య, రాపోలు రాజశేఖర్, మిర్యాల కవిత వెంకటయ్య, మిర్యాల జయమ్మ రమేష్, చంద్రగిరి పుష్ప నరసింహ, బొడ్డు శంకరయ్య, జింకల నరసింహ, దొంత యాదగిరి,



అలిసేరు వంశీ, జ్యోతి, ఇంద్రమ్మతో పాటు ఆలయ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మునిపంపుల జెడ్పీహెచ్ఎస్‌లో జూనియర్ అసిస్టెంట్‌ను కొనసాగించాలి

డిప్యుటేషన్ రద్దు చేయాలని జెడ్పీ డిప్యూటీ సీఈఓకు వినతి

- గ్రామ సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం, సీపీఎం నాయకుల డిమాండ్

**తొలివెలుగు, భువనగిరి:** మునిపంపుల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న జూనియర్ అసిస్టెంట్‌ను డిప్యుటేషన్‌పై ఇతర చోటుకు పంపిన నిర్ణయాన్ని రద్దు చేసి, తిరిగి అదే పాఠశాలలో కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామ సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం, సీపీఎం గ్రామ శాఖ నాయకులు భువనగిరి జిల్లా పరిషత్ కార్యాలయంలో శనివారం జెడ్పీ డిప్యూటీ సీఈఓ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం మాట్లాడుతూ.. జూనియర్ అసిస్టెంట్



డిప్యుటేషన్ కారణంగా పాఠశాల పరిపాలనా పనులు తీవ్రంగా దెబ్బతింటున్నాయని తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు వివిధ పరిపాలనా అవసరాల కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పాఠశాల పరిపాలన సజావుగా సాగేందుకు సంబంధిత జూనియర్ అసిస్టెంట్‌ను మునిపంపుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనే కొనసాగించేలా జిల్లా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యుడు తొలుపునూరి శ్రీనివాస్, గ్రామ శాఖ కార్యదర్శి తాళ్లపల్లి జితేందర్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వేముల నాగరాజు, నాయకులు గంటెపాక శివకుమార్, మేడి ముకుంద, పుట్టల ఉదయ్‌కుమార్, అప్పం సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి

- మండల అధ్యక్షుడిని అభినందించిన జిల్లా అధ్యక్షుడు బీర్ల ఐలయ్య
- నూతన మండల అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ సన్మానం



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య యాదవ్ పిలుపునిచ్చారు. శనివారం నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఉప్పునూతల వెంకటేష్ యాదవ్, బీర్ల ఐలయ్య యాదవ్‌ను ఆయన నివాసంలో కలిసి మర్యాదపూర్వకంగా సన్మానించారు. మండల అధ్యక్షుడిగా తన నియామకానికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి అర్హులైన లబ్ధిదారునికి చేరవేయడంలో మండల, పట్టణ స్థాయి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని అన్నారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తూ పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని పేర్కొన్నారు. అనంతరం బీర్ల ఐలయ్య యాదవ్ నూతన మండల అధ్యక్షుడు ఉప్పునూతల వెంకటేష్ యాదవ్‌ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

## మృతుడి కుటుంబానికి సర్పంచ్ ఆర్థిక చేయూత

- రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేత
- ధర్మారెడ్డిపల్లిలో కుటుంబ సభ్యులను పరామర్శించిన సామ రవీందర్ రెడ్డి




**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** మండలంలోని ధర్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన అమనిగంటి సత్తయ్య ఆకస్మికంగా గుండెపోటుతో మృతిచెందడంతో ఆయన కుటుంబ సభ్యులను గ్రామ సర్పంచ్ సామ రవీందర్ రెడ్డి శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడికి నివాళులర్పించిన సర్పంచ్, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం వారి కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేసి అండగా నిలిచారు. కష్టకాలంలో బాధిత కుటుంబాలకు తోడుగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొమిరి కిరణ్ కుమార్, మాజీ ఉప సర్పంచ్ సామ రవీందర్ రెడ్డి, అమనిగంటి బాలరాజు, సత్తయ్య, కనకపోయిన భాస్కర్, శివ తదితరులు పాల్గొన్నారు.



## ఓటరు జాబితా సవరణ పారదర్శకంగా నిర్వహించాలి

- ఎస్ఐఆర్ అవగాహన సదస్సులో ప్రభుత్వ విప్ వేముల వీరేశం
- బూత్ స్థాయిలో సమన్వయంతో పనిచేయాలని సూచన

**తొలివెలుగు, చిట్యాల:** చిట్యాల పట్టణంలోని శ్రీ లక్ష్మీ గార్డెన్స్‌లో నార్కట్‌పల్లి, చిట్యాల, రామన్నపేట మండలాల బూత్ లెవెల్ ఆఫీసర్లు (బీఎల్‌వోలు), బూత్ లెవెల్ ఏజెంట్లకు నిర్వహించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) అవగాహన సదస్సుకు ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ.. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ప్రతి అర్హుడైన పౌరుడికి ఓటు హక్కు కల్పించేలా బూత్ స్థాయిలో అధికారులు, బూత్ లెవెల్ ఏజెంట్లు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పిస్తూ, ఓటరు జాబితా తయారీ, సవరణలో ఎలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, సంబంధిత అధికారులు, బూత్ లెవెల్ ఆఫీసర్లు, బూత్ లెవెల్ ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## భోగారం చేనేత సహకార సంఘం ఎన్నికల వేడి

- భారీ ర్యాలీతో డైరెక్టర్ అభ్యర్థుల నామినేషన్లు
- పద్మశాలి వర్గాల మద్దతుతో ఉత్సాహంగా కార్యక్రమం



**తొలివెలుగు, రామన్నపేట:** మండల పరిధిలోని భోగారం చేనేత సహకార సంఘం ఎన్నికల నేపథ్యంలో డైరెక్టర్ పదవులకు పోటీ చేస్తున్న పద్మశాలి సొసైటీ అభ్యర్థులు శనివారం భారీ ర్యాలీ నిర్వహించి నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. భోగారం గ్రామంలో నిర్వహించిన ర్యాలీలో పద్మశాలి సంఘ సభ్యులు, కుటుంబ సభ్యులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని అభ్యర్థులకు తమ మద్దతు ప్రకటించారు. అనంతరం ఎన్నికల అధికారుల ఎదుట అభ్యర్థులు నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. నినాదాలు, హర్షధ్వానాల మధ్య ఉత్సాహభరిత వాతావరణంలో నామినేషన్ ప్రక్రియ కొనసాగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, పద్మశాలి సంఘ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## చౌటుప్పల్‌లో ట్రాఫిక్ రద్దీ నివారణకు ప్రత్యేక చర్యలు

- నారాయణపూర్ ఎక్స్‌రోడ్ జంక్షన్ అభివృద్ధి పనులు ప్రారంభం
- వాహనదారులు ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని సీఐ వెంకటేష్ విజ్ఞప్తి

**తొలివెలుగు, చౌటుప్పల్:** జాతీయ రహదారి విస్తరణ పనుల నేపథ్యంలో చౌటుప్పల్ పట్టణంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు శనివారం పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ, చౌటుప్పల్ డివిజన్ ట్రాఫిక్ డీఎస్పీ ఆదేశాల మేరకు ట్రాఫిక్ సీఐ నందగిరి వెంకటేష్ ఆధ్వర్యంలో నారాయణపూర్ ఎక్స్‌రోడ్ జంక్షన్ అభివృద్ధి పనులు ప్రారంభించారు. ట్రాఫిక్ నిర్వహణ ప్రణాళికలో భాగంగా ప్రస్తుతం వినియోగంలో లేని సర్వీస్ రోడ్డులోని డ్రైనేజ్ కల్వర్ట్‌ను తొలగించి, అక్కడ సిమెంట్ పైపులు ఏర్పాటు చేసి వాటిపై రహదారిని విస్తరించే పనులు చేపట్టారు. ఈ అభివృద్ధి పనులతో సర్వీస్ రోడ్డును ప్రధాన రహదారితో అనుసంధానం చేయనున్నట్లు అధికారులు తెలిపారు. పనులు పూర్తయిన అనంతరం నారాయణపూర్ ఎక్స్‌రోడ్ జంక్షన్ వద్ద వాహనాల



రాకపోకలు మరింత సాఫీగా సాగడంతో పాటు ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గుతుందని ట్రాఫిక్ సీఐ నందగిరి వెంకటేష్ తెలిపారు. దీంతో ప్రయాణికుల సమయం ఆదా కావడంతో పాటు రహదారి భద్రత కూడా మెరుగుపడుతుందని పేర్కొన్నారు. అభివృద్ధి పనులు పూర్తయ్యే వరకు వాహనదారులు ట్రాఫిక్ పోలీసులకు సహకరించి, ట్రాఫిక్ మళ్లింపులు, సూచనలను తప్పనిసరిగా పాటించాలని ట్రాఫిక్ సీఐ నందగిరి వెంకటేష్ విజ్ఞప్తి చేశారు.